క్లుప్తంగా

మల్‌రెడ్డి రాంరెడ్డికి సన్మానం



మల్‌రెడ్డి రాంరెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని కాంగ్రెస్ నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. చంచల్‌గూడ జైల్ మాజీ సలహాదారుడు కేవీ రమేష్‌రాజు, కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎన్ను గోవర్ధన్‌రెడ్డిలు రాంరెడ్డికి శాలువ కప్పి, తలపాగా పెట్టి, బొకె ఇచ్చి గజమాలతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

మంచాల: రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని మంచాల మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, చీమల జంగయ్య, మాసయ్య గౌడ్, మార సురేష్, అంతటి రాజు, పాండాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

మంచాల: మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో150మంది విద్యార్థులకు బీజేపీ నాయకుడు కారింగ్ రాజు గౌడ్ మంగళవారం టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీశైలం, సురేష్, జంగయ్య, జనార్దన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి తొలగించాలి

ఇబ్రహీంపట్నం: మహంకాళి బోనాల సందర్భంగా రోడ్లకు ఇరువైపుల, గుంతల్లో పోసిన ఎర్రమట్టిని తొలగించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జలమోని రవీందర్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎర్రమట్టి బురదగా మారిందన్నారు. బోనాలు ఎత్తుకొని వచ్చిన మహిళలు, భక్తులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఆలయ పరిసరాలను శుభ్ర పరచడంలో మున్సిపల్ యంత్రాంగం విఫలం చెందిందని ఆయన ఆరోపించారు.

టౌన్‌ప్లానింగ్ అధికారి బదిలీ

తుర్కయంజాల్: మున్సిపాలిటీ ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న ఇ. శ్రీనివాసులును గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఎస్. దేవేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

మంచాల సూపరింటెండెంట్‌గా అజీమ్

మంచాల: మంచాల మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా ఎండీ అబ్దుల్ అజీమ్ మంగళవారం బాధ్యతలను తీసుకున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎల్లంకి జంగయ్య గౌడ్ బదిలీలో భాగంగా ఇబ్రహీంపటన్నంకు వెళ్లారు. ఆయన స్థానంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యాలయంలో పని చేసే అబ్దుల్ అజీమ్‌ను బదిలీ చేశారు. మంచాల మండల కార్యాలయంలో పని చేసే జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా, ఇబ్రహీంపట్నం మండల కార్యాలయంలో పని చేసే భాస్కర్ ఇక్కడకు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వచ్చారు. ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ మధుసూధన్ చారి, కార్యాలయ సిబ్బంది వారికి శాలువా కప్పి సన్మానం చేశారు.

అంకితభావంతో పనిచేస్తే గౌరవం



అఫ్సర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కడ్తాల్: ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపుతో పాటు సమాజంలో గౌరవించబడుతారని, ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పిడి గోపాల్ అన్నారు. మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో పదిహేను సంవత్సరాలుగా పశుగణాభివృద్ధి శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న అప్సర్, గట్టు ఇప్పలపల్లి గ్రామానికి బదిలీ అయ్యారు. మంగళవారం రావిచేడ్ గ్రామంలోని పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్సర్‌ను గ్రామస్తులు సన్మానించి, వీడ్కోలు పలికారు.

వరిపైనే ఆశలు!

- డివిజన్‌లో నేటికి 18 శాతానికి మించని సాగు
- వర్షాలు సకాలంలో పడకపోవడంతో మెట్టకు ఆలస్యం
- రుణమాఫీ కానీ రైతుల్లో ఆందోళన
- పంటకు అందని సాయం
- ఇబ్బందుల్లో అన్నదాతలు



నందివనపర్తిలో నాట్లేయడానికి సిద్ధంగా ఉన్న నారు

యాచారం: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నా డివిజన్‌లో పంటల సాగు విస్తీర్ణం మాత్రం పెరగలేదు. నేటికి 20 శాతానికి మించి సాగు పెరగకపోవడంతో ఆందోళన కలిగిస్తుంది. వానాకాలం ప్రారంభ దశలో వర్షాలు అదునులో కురవలేదు. దీంతో మెట్ట సాగు ఆలస్యమైంది. రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు పూర్తిగా వట్టిపోయాయి. ఆయా గ్రామాల్లోని బోరుబావుల్లో భూగర్భజలాలు ఎండిపోవడంతో వరి పంటతో పాటు కూరగాయల సాగు కూడా పెరగలేదు. వానాకాలం ప్రారంభంలో వర్షాలు కురిస్తే మెట్ట పంటల సాగు పెంచుకుందామని రైతుల్లో ఆశ ఉన్నా వరుణుడు కరుణించకపోవడంతో సాధ్యం కాలేదు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల్లో ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 50,986 ఎకరాలని వ్యవసాయ శాఖ నిర్ధారించింది. వానాకాలం పంటల సాగు సమయం ముగుస్తున్నా కూడా నేటికి సాగు విస్తీర్ణం 15.21శాతంగానే ఉంది. అత్యధికంగా సాగు విస్తీర్ణం పెరిగే యాచారం మండలంలోని నందివనపర్తి, చౌదర్‌పల్లి, యాచారం, గునుగల్, చింతుల్ల, గడ్డమల్లయ్యగూడ, మంచాల మండలంలోని జాపాల, ఆరుట్ల, మంచాల, చెన్నారెడ్డిగూడ, తిప్పాయిగూడ తదితర గ్రామాల్లో మెట్ట పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.

వరికే అవకాశం..

ముసురుపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. అనుకున్నంత వర్షం కురిస్తే భూగర్భజలాల్లో నీరు చేరి బోరుబావుల్లో నీటి నిల్వ పెరుగుతుంది. దీంతో వరి సాగు పెరగవచ్చనే ఆశ రైతుల్లో నెలకొంది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో ఈ వానాకాలం కింద 23,263 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచానా వేసింది. కాని బోరుబావుల్లో నీళ్లు లేకపోవడంతో నేటి వరకు కేవలం 2,809 ఎకరాల్లోనే వరి పంట సాగైంది. ఆయా గ్రామాల్లోని రైతులు వర్షాలు కురిస్తే బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంటుందనే ఆశతో రోహిణి కార్తెలో వరి నార్లు పోసి ఉంచారు. వర్షాలు కురిస్తే మరో పక్షం రోజుల వరకు వరి నాట్లు వేసుకునే అవకాశం ఉంటుంది. కానీ ఆ ఆశలు రైతుల్లో కనిపించడం లేదు. పత్తి పంట సాగు కూడా అంతంతా మాత్రమే ఉంది. డివిజన్‌లో 10,050 ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందని అంచానా వేశారు. నేటికి కేవలం 4,140 ఎకరాల్లో పంట సాగైంది. వర్షాలు సకాలంలో కురియకపోవడం, సర్కార్ కూడా సకాలంలో రైతుబంధు నిధులు జమచేయలేదు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సరైన సమయంలో ప్రభుత్వ సాయం అందక పోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బ్యాంకర్లు కొత్త రుణాలు ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో రైతులు సాగు వైపు ఆసక్తి చూపలేదు.

రూ. లక్షల్లోపు రుణమాఫీపై ఆందోళన ..

ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని ఆయా గ్రామాల్లోని దాదాపు 20 వేల మందికి పైగా రైతులు రూ. లక్షల్లోపు రుణాలు తీసుకున్నారు. పీఏసీఎస్‌లు, ఆయా బ్యాంకుల్లో రుణాలు పొందారు. 2018 తర్వాతనే రూ. లక్షల్లోపు రుణాలు తీసుకున్న రైతులు ఉన్నప్పటికి సర్కార్ నుంచి కేవలం 7,601 మంది రైతులకే రూ. లక్షల్లోపు రుణాలు మాఫీ అయినట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులకు ఉత్తర్వులు అందాయి. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని అనేక గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులే ఉండడంతో వారంతా రూ. లక్షలోపు రుణాలు తీసుకున్నారు. రుణాలు తీసుకున్న రైతుల్లో కూడా సగానికి పైగా మాఫీ కాలేదు. వచ్చే రెండు విడతల్లో మాఫీ అయ్యే అవకాశమున్నా రూ. లక్షన్నర, రెండు లక్షల వరకు రుణమాఫీ ఎంత మందికి అవుతుందోనని రైతుల్లో ఆందోళన నెలకొంది.

వెయ్యి మందికి పైగా..



యాచారం పీఏసీఎస్‌లో 1,519 మంది రైతులు రూ. లక్ష లోపు వ్యవసాయ పంట రుణాలు తీసుకున్నారు. లిస్టులో మాత్రం 447 మంది రైతులకే మాఫీ అయినట్లు వచ్చింది. తమకు రుణమాఫీ అవుతుందా? లేదా ? తెలుసుకోవడం కోసం నిత్యం రైతులు కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు.

– నాగరాజు, సీఈఓ యాచారం పీఏసీఎస్

ఫిర్యాదులు వస్తున్నాయి..



మండలంలోని పలు బ్యాంకుల్లో రూ. లక్ష లోపు వ్యవసాయ పంట రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ కాలేదని, లిస్టులో తమ పేర్లు లేవని ఫిర్యాదులు వస్తున్నాయి. యాచారం పీఏసీఎస్, నక్కర్తమేడిపల్లి ఇండియన్ బ్యాంకుల పరిధిలోని రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు.

– సందీప్‌కుమార్, వ్యవసాయాధికారి, యాచారం

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

తెలంగాణకు అన్యాయం చేశారని నేతల ధ్వజం

ఆమనగల్లు: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రాధాన్యం కల్పించారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా ప్రతీఒక్కరికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు.

కడ్తాల్: బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నిరాశను మిగిల్చిందని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల కోసమే బడ్జెట్ పెట్టినట్లుగా ఉందని, తెలంగాణకు నిధుల కేటాయింపుల్లో తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపు, పాలమూర్ రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, నిధుల కేటాయింపు గురించి ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా స్పందించకపోవడం విచారకరమన్నారు. మూసీనది ప్రక్షాళనకు కూడా నిధులు కేటాయించలేదని, తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలకు పెద్దపీట..

తలకొండపల్లి: మహిళా రైతు, నిరుద్యోగ యువతకు అండగా ఉండి, పేద, మధ్య తరగతి ప్రజలకు పెద్దపీట వేసిందని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద లబ్ధిదారునికి ఇళ్లు నిర్మించాలని పీఎం ఆవాస్ యోజన పథకానికి అధిక నిధులు కెటాయించడం శుభ పరిణామం. దేశీయ ఉత్పత్తిని పెంపొందించడానికి మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వారికి పన్ను ఆదాను ప్రకటించడం సంతోషించదగిన విషయం. అన్ని వర్గాల వ్యాపారులకు ప్రయోజనం చేకూరే విధంగా బడ్జెట్ ఉండడం దేశం త్వరితగతిన ఎదగడానికి అవకాశం ఉంది.

సాగులో మెలకువలు పాటించండి



ఆమనగల్లు: రాంనుంతలలో రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయాధికారి అరుణకుమారి

వ్యవసాయాధికారి అరుణకుమారి

ఆమనగల్లు: రైతులు పంట సాగులో మెలకువలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. రాంనుంతల గ్రామంలో రైతులు సాగుచేసిన పంటలు వరి, పత్తి, జొన్న, మొక్కజొన్న పైర్లను మంగళవారం ఆమె పరిశీలించి సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ పంటల సాగులో మెలకువలు పాటించడం ద్వారా చీడపీడలను అరికట్టవచ్చన్నారు. వరి నారు నాటే ముందు కొసలు తుంచి నాటడం వల్ల కాండం తొలచు పురుగు గుడ్లను నివారించొచ్చని ఆమె చెప్పారు. కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు 2కిలోల చొప్పున వాడటం వల్ల వరినాటిన తరువాత 45 రోజుల వరకు కాండం తొలచు పురుగు అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శంకర్, సక్రు, శంకర్, డోలీ, పిప్లి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండలంలోని రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న శాఖీయ దశలో ఎక్కువ నీటిని తట్టుకోదని, కాబట్టి పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. మొక్కజొన్నను ఈ నెల 31వరకు విత్తుకోవచ్చని తెలిపారు. ముందు జాగ్రత్తగా జొన్నలో వచ్చు కాండం తొలుచు పురుగు నివారణకు, విత్తిన 30, 35రోజుల్లోపు ఎకరాకు 4 కిలోల కార్బోఫురాన్, 3జి గుళికను కాండము సుడులలో వేసినచో కాండం తొలుచు పురుగును పూర్తిగా అరికట్టవచ్చని తెలిపారు. ప్రస్తుత సమయంలో కంది పంటకు పైటాపార ఎండు తెగులు వచ్చే అవకాశముందని, 2 గ్రాముల మెటలాక్సిల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసినట్లైతే తెగులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

ఎంపీడీఓ సుజాత



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత

కడ్తాల్: గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు, పారిశుద్ధ్యం విషయంలో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుజాత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి ఎంపీడీఓ సుజాత ఆధ్వర్యంలో ఓడీఎఫ్, హర్‌ఘర్ జల్ ప్రచారానికి సంబంధించి ప్రత్యేక గ్రామసభ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దని సూచించారు. బహిరంగ మలమూత్ర విసర్జన నివారణకు కృషి చేయాలని, ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. హర్‌ఘర్ జల్ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఇమ్రాన్ బాబా, భిక్షపతి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఆమనగల్లులో బీఎంఎస్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు ఎదుట మంగళవారం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి లక్యనాయక్, ఉపాధ్యక్షుడు యాదయ్య, శంకర్, సభ్యులు చందర్, పంతు, మల్లిక్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారావ్, అప్పారావ్, అలివేలు, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఈతచెట్లను నాటాలని వినతి



ఎక్సైజ్ ఎస్‌ఐ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న గౌడ యువజన సంఘం నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని కాటమేశ్వర దేవాలయం వద్ద ఈత, ఖర్జూర చెట్లను నాటాలని మండల గౌడ యువజన సంఘం అధ్యక్షుడు నరేశ్‌గౌడ్ కోరారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఎస్ఐ కృష్ణప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్‌గౌడ్ మాట్లాడుతూ కాటమేశ్వర దేవాలయం స్థలంలో ఈత, ఖర్జూర చెట్లు నాటాలని ఆయన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ యువజన సంఘం నాయకులు గజ్జె రాఘవేందర్‌గౌడ్, కుమార్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షపదవికి నామినేషన్లు



రమేశ్ నాయక్



బాల్‌దాస్ నాయక్

కడ్తాల్: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షపదవికి ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేసినట్లు, మండల పరిధిలోని పల్లెచెలక తండా గ్రామ పంచాయతీకి చెందిన రమేశ్‌నాయక్ మంగళవారం తెలిపారు. పది సంవత్సరాలుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి తన వంతు కృషి చేశానన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పని చేస్తూ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక ఉద్యమాలు చేసినట్లు గుర్తు చేశారు.

బాల్‌దాస్‌నాయక్...

కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షపదవికి పల్లెచెలక తండా గ్రామ పంచాయతీకి చెందిన బాల్‌దాస్‌నాయక్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్‌కు కొన్ని సంవత్సరాలుగా సేవలందిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. పార్టీకి మరింత సేవ చేయాలనే లక్ష్యంతో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారన్నారు.


ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఎంపిక



నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిహెచ్. వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా బాబు, కోశాధికారిగా నవీన్, కార్యదర్శిగా ఎన్. శివ కుమార్, మీడియా ఇన్‌చార్జి పి. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రాజు, శేఖర్, బాల్‌రాజ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఇన్‌చార్జిగా నరేందర్‌లు ఎంపికయ్యారు.

వాల్‌పోస్టర్ విడుదల



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: ఫొటో, వీడియో గ్రాఫర్లు మారుతున్న సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా నూతన మెలుకువలు నేర్చుకోవాలని ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఇబ్రహీంపట్నంలో మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు దాసు, కార్యదర్శి సంజీవ, కోశాధికారి యాదగిరితోపాటు నగేష్, రాములు, రాజు, మహేందర్, బాబురావు, రవి, సాయి, సూర్య, శ్రావణ్, దినేష్, శ్రీకాంత్, అరవింద్, రమేష్, నరేష్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చేర్పించండి



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ పార్వతి

ఆమనగల్లు: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆమనగల్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందిస్తారని ఆమె చెప్పారు. పట్టణంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మబాట అంగన్‌వాడీ బాట' నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబునాయక్



మాట్లాడుతున్న రాంబాబునాయక్

కడ్తాల్: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబునాయక్ పేర్కొన్నారు. ఆగస్టు 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని జిల్లా స్థాయి సన్నాహక సమావేశాన్ని మంగళవారం మండల కేంద్రంలోని ఎంబీఏ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబునాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. లంబాడాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన జీవో నెంబర్ 33కు వెంటనే చట్టబద్ధత కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలన్నారు. గిరిజనులకు ఎస్టీ కమిషన్‌తో పాటు, ట్రైబల్ అడ్వైజర్ కమిటీని వెంటనే నియమించాలన్నారు. నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని, తండాల అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల సేవాలాల్ సేన కమిటీలను ఎన్నుకున్నారు. కడ్తాల్ మండల సేవాలాల్ సేన అధ్యక్షుడిగా ఇస్లావత్ రమేశ్‌నాయక్, తలకొండపల్లి అధ్యక్షుడిగా సభావత్ రూప్లానాయక్, మాడ్గుల మండల అధ్యక్షుడిగా నేనావత్ రవినాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రఘురాం రాథోడ్, వాంకుడోత్ నరేశ్‌నాయక్, లక్పతినాయక్, భీంలాల్‌నాయక్, రాజునాయక్, కృష్ణనాయక్, బలరాంనాయక్, జగన్, శ్రీను, హీరాసింగ్, రమేశ్, లక్ష్మణ్‌నాయక్ మోతీలాల్, రాజు, కొర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే గుర్తింపు

రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్

కడ్తాల్: విద్యతోనే గుర్తింపు ఉంటుందని మాజీ జెడ్పీటీసీ రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెలుగురాళ్ల తండాకు చెందిన ఇస్లావత్ మారుతికుమార్ జేఈఈ ఐఐటీ అడ్వాన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరిలో 391వ ర్యాంకుతో ప్రతిభ చాటాడు. మంగళవారం మండల కేంద్రంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మారుతికుమార్‌ను, ట్రస్ట్ చైర్మన్ దశరత్‌నాయక్‌తో పాటు, స్థానిక గిరిజన నాయకులు అభినందించి సన్మానించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.5వేలు అందజేశారు. అనంతరం దశరథ్‌నాయక్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాండు, కృష్ణ, శ్రీను, చందర్, వెంకటేశ్, రతన్, గణేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లిలో టేకూరి పోచమ్మ మంగళవారం మృతి చెందింది. పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డిలు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కేశవరెడ్డి రూ. 2,500, కాసు శ్రీనివాసురెడ్డి రూ. 5,000 ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ఇంజనీర్ బండ్ల తిరుపతి రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జంగయ్య, కృష్ణయ్య, రాజు, చెన్నకేశవులు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: మారుతికుమార్‌ను అభినందిస్తున్న దశరథ్‌నాయక్